సాక్షి
నంద్యాల
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



కంటైనర్ కేంద్రం విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న దేవస్థానానికి ఓ భక్తుడు రూ. 5.70 లక్షలతో తయారు చేయించిన కంటైనర్‌ను విరాళంగా అందజేశారు. దీనిని ప్రసాదాల విక్రయాల కేంద్రంగా వినియోగిస్తున్నారు.



భక్తి పరిమళం

మంత్రాలయం శ్రీమఠంలో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం శాఖోత్సవం, రజత మంటపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,627
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 55,275
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 10,275

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్

బొమ్మలసత్రం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల అందజేసిన ఫిర్యాదులపై అలసత్వం వహించవద్దని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 83 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుల్లో అధికంగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, అన్నదమ్ముల వివాదాలు, వివిధ రకాల మోసాలు అధికంగా ఉన్నాయన్నారు. చట్టపరిధిలోని సమస్యలపై వెంటనే స్పందించి అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. సివిల్ సమస్యలపై కోర్టులను ఆశ్రయించాలని సూచించామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలో పాఠశాల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నంద్యాల పట్టణంలోని ముల్లాన్‌పేటలోని ఉర్దూ పాఠశాలలో ఉర్దూపై కాంప్లెక్స్ నిర్వహించారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ లలిత జిల్లాలోని 29 మండలాల్లో 142 ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. సోమవారం ఇంగ్లిష్, ఫిజికల్, సైన్స్, హిందీ, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు సబ్జెక్టు సమావేశాలు నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో పని చేసే వ్యాయామ ఉపాధ్యాయులకు జిల్లాలో ఏడు చోట్ల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో 142 స్కూల్ కాంప్లెక్సులు ఉండగా 1,378 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ సమావేశాలకు హాజరయ్యారన్నారు. అలాగే 6,620 మంది వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారన్నారు.

ఓటర్ల జాబితా సవరణను సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ వెంకటనారాయణమ్మ

గోస్పాడు: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వెంకటనారాయణమ్మ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి, బీఎల్‌ఓలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2025 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిర్వహణ, విధి విధానాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. 2025 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పులను సవరించడంతో పాటు మార్పులు, చేర్పులు చేసుకొనే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, ఎన్నికల డీటీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

గుమ్మితం తండాలో పురాతన శాసనం



బయటపడిన శిలాశాసనం

ఓర్వకల్లు: గుమ్మితం తండా సమీపంలోని మల్లికార్జున స్వామి ఆలయం బయట పురాతన శిలాశాసనం బయటపడింది. ఆలయాల పరిశీలనలో భాగంగా ఇటీవల జిల్లా పురావస్తు శాస్త్రవేత్తలు ఆలయాన్ని సందర్శించినప్పుడు ఈ శిలా శాసనాన్ని గుర్తించడంతో వెలుగులోకి వచ్చింది. క్రీస్తు శకం 12, 13వ శతాబ్ద కాలంలో కన్నడం, సంస్కృతం, తెలుగు భాషల్లో ఓ శిలపై అక్షరాలను గుర్తించారు. పూర్వం మల్లికార్జున దేవదేవునికి మహా మండలేశ్వరుని కుమార్తె గంగాదేవి ఏదో బహుమతిని ప్రదానం చేసినట్లు ఈ శాసనం ద్వారా తెలుస్తుందని పురావస్తుశాఖ అధికారులు సమాచారం.

పారని ‘పథకం’.. వెక్కిరిస్తున్న పేదరికం!

ప్రజలకు కరువైన ఆదాయ మార్గాలు

- సంక్షేమ పథకాలకు 'కూటమి' మంగళం
- ప్రజల్లో భారీగా తగ్గిన కొనుగోలు సామర్థ్యం
- గత ఏడాది జూలై నెలతో పోలిస్తే 20.06 శాతం తగ్గిన జీఎస్టీ ఆదాయం
- వైఎస్సార్‌సీపీ హయాంలో 12.84 శాతానికి తగ్గిన పేదరికం



ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని హామీలతో ఊదరగొట్టిన కూటమి నేతలు.. ఇప్పుడు ఆ ఊసే మరిచారు. అడుగడుగునా కక్ష సాధింపు ధోరణి.. చెప్పినట్లుగానే రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి.. పథకాల అమలును విస్మరించడం ప్రజల జీవన ప్రమాణంపై పెను ప్రభావం చూపుతోంది. గత ప్రభుత్వంలో ప్రతినెలా ఏదో ఒక పథకంతో బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతుండటంతో కొనుగోలు శక్తి పెరిగింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో కనీస అవసరాలను తీర్చుకునేందుకు కూడా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆదాయ మార్గాలు కనిపించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో క్రమేపీ పేదరికం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

రాబడి తగ్గుతుంది



మార్కెట్ వ్యవస్థను సామాన్యుడు మొదలుకొని సంపన్నుడి వరకు ప్రభావితం చేస్తారు. ప్రజల్లో నగదు సరఫరా పెరిగినప్పుడు వివిధ వస్తువులు కొనుగోలు ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ఇప్పుడు ప్రజల్లో నగదు సర్క్యులేషన్ తగ్గింది. ఇది మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. ఇది ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం కలిగిస్తోంది. ఉదాహరణకు ఇటీవల వరకు వలంటీర్ వ్యవస్థ ఉంది. వారికి నెలనెలా కొంత పారితోషికం వచ్చేది. వారు ప్రతి నెలా మార్కెటింగ్ చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి దోహదపడేవారు. ఇప్పుడు ఈ వ్యవస్థ నిలిచిపోవడంతో వారు మార్కెట్‌ను ప్రభావితం చేయలేని పరిస్థితి ఏర్పడింది. సంక్షేమ పథకాలు కూడా అభివృద్ధికి సూచికలే. సంక్షేమ పథకాలు ఒక్కసారిగా ఆగిపోతే పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వ రాబడి తగ్గుతుంది. ఇది పేదరికాన్ని కూడా పెంచుతుంది.

– ప్రొఫెసర్ ఎస్.మన్సూర్ రహిమాన్, ఆర్థికవేత్త, కర్నూలు

కర్నూలు(అగ్రికల్చర్): విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదరికాన్ని గణనీయంగా తగ్గించింది. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. రెండు నెలల అవుతున్నా.. సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించలేదు. దీంతో నగదు లావాదేవీలు మందగించాయి. ప్రజల కొనుగోలు సామర్థ్యం తగ్గి.. ఈ ఏడాది జూలైలో జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం భారీగా పడిపోయింది. గతేడాది జూలై నెలలో జీఎస్టీ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్రం వాటా కింద రూ.79,56,26,000 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జూలైలో రూ.63,59,66,000 వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఆదాయం రూ.15.96 కోట్లు తగ్గింది. రాష్ట్రం మొత్తం మీద సగటున 7 శాతం జీఎస్టీ ఆదాయం తగ్గగా ఇదే సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అది ఏకంగా 20.06 శాతం ఉంది. ఆగస్టు నుంచి జీఎస్టీ ఆదాయం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఏర్పడింది.

నెల	వచ్చిన ఆదాయం (రూపాయల్లో..)
జనవరి	75,80,29,120
ఫిబ్రవరి	72,78,89,862
మార్చి	73,82,77,440
ఏప్రిల్	88,77,39,672
మే	67,17,09,842
జూన్	56,96,43,728
జూలై	63,59,66,538

> వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో వైఎస్సార్ రైతుభరోసా, అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, కాపు నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన, కళ్యాణమస్తు.. ఇలా అనేక కార్యక్రమాల కింద ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.12,500 కోట్ల వరకు లబ్ధి చేకూరింది.

మొదటిసారిగా తగ్గిన ఆదాయం

కోవిడ్ సమయంలో 2019 జూన్ మినహా మిగిలిన అన్ని సమయాల్లో ప్రభుత్వానికి జీఎస్టీ ద్వారా ఆదాయం భారీగా వచ్చింది. నెలనెలా పెరగడమే తప్ప.. తగ్గింది లేదు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో రూ.88.77 కోట్లు జీఎస్టీ ద్వారా రాష్ట్ర వాటా కింద ఆదాయం వచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటి సారిగా మే నెల నుంచి ఆదాయం తగ్గుతూ వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జీఎస్టీ ఆదాయం తగ్గిన పరిస్థితి ఎపుడూ లేదు. మొదటి సారిగా మే, జూన్, జూలై నెలల్లో జీఎస్టీ ఆదాయం భారీగా తగ్గడం గమనార్హం. ఆదాయం పడిపోయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం నోరు విప్పడం లేదు. సంక్షేమ పథకాలు కూడా అభివృద్ధి సూచికలేనని ఒకవైపు నీతి ఆయోగ్, మరోవైపు ఆర్‌బీఐ కూడా ప్రకటించాయి. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. సూపర్–6తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీలు గుప్పించి.. అధికారంలోకి వచ్చాక వాటి అమలును మరిచారు.

సంక్షేమ పథకాలు అవసరమే



సంక్షేమ పథకాలు పేదరికాన్ని తగ్గించడంలో కీలకపాత్ర వహిస్తాయి. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేయడం వల్లనే 19.64 శాతం ఉన్న పేదరికం 12.84 శాతానికి తగ్గింది. సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోతే మళ్లీ పేదరికం పెరుగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. గత ఏడాది జూలై నెలలో జీఎస్టీ ద్వారా రూ.79 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జూలై 20 శాతం జీఎస్టీ ఆదాయం తగ్గింది. సంక్షేమ పథకాల అమలు లేకపోవడం వల్లనే ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెట్టే కొనుగోళ్లు మందగించడంతో జీఎస్టీ రూ.63.59 కోట్లు తగ్గింది. సంక్షేమ కార్యక్రమాలు కూడా అభివృద్ధిని సూచిస్తాయి.

– జైపాల్‌రెడ్డి, రిటైర్డ్ సీఈఓ, సలహాదారు, టీఎస్ఐఆర్‌డీ, హైదరాబాద్



వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

- ➤ వైఎస్సార్‌సీపీ హయాంలో పేదరికం నిర్మూలన లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు.
- ➤ నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2019–2023 మధ్య రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది.
- ➤ 2019కి ముందు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19.64 శాతం పేదరికం ఉండేది.
- ➤ వైఎస్సార్‌సీపీ హయాంలో అది 12.84 శాతానికి తగ్గిపోయింది. సంక్షేమ పథకాల ఫలితంగా 6.80 శాతం పేదరికాన్ని తగ్గించినట్లు స్పష్టమవుతోంది.
- ➤ పేదరికం స్థాయిని అంచనా వేసేందుకు హెల్త్, విద్య, జీవన ప్రమాణం(స్టాండర్డ్ ఆఫ్ లివింగ్) అంశాల్లో సర్వే చేపట్టింది. ఇందులో 12 అంశాలు ఉన్నాయి.
- ➤ ఆరోగ్యం(హెల్త్)లో పోషకాహారం(న్యూట్రీషియన్), శిశు మరణాలు, గర్భిణుల రక్షణ, విద్యకు సంబంధించి బడి వయస్సు పిల్లలందరు బడిలో ఉండటం, పాఠశాలల్లో హాజరు పూర్తిగా ఉండటం, పోషకాహారం, శానిటేషన్, తాగునీరు, విద్యుత్, హౌసింగ్, అసెట్స్, బ్యాంకుల్లో ఖాతా కలిగి ఉండటం.
- ➤ గత ప్రభుత్వ పాలనలో పేదరికాన్ని తగ్గించడంలో విజయనగరం జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదో స్థానంలో నిలిచినట్లు 2023లో నీతి ఆయోగ్ ప్రకటించింది.
- ➤ దళారీల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నగదు బదిలీ చేయడాన్ని నాడు నీతి ఆయోగ్ ప్రశంసించింది.

కూటమి పాలనలో దౌర్జన్యాలు, దాడులు



నరికేసిన జామ చెట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా మారారు
- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దౌర్జన్యాలు, దాడులు తీవ్ర తరమయ్యాయని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి పొలంలో కొంతమంది జామ చెట్లను నరికేసిన విషయం తెలుసుకున్న ఆయన సోమవారం జామ తోటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేశ్ రెడ్‌బుక్ పాలన అమలవుతుందన్నారు. గతంలో ఇదే మండలంలో ఉండుట్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డిపై హత్యాయత్నం చేశారన్నారు. గడివేముల వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి శ్రీనివాసులు బంకును దగ్ధం చేశారన్నారు. గత నెల 29వ తేదీన జెడ్పీటీసీ పొలంలో బిందుసేద్యం పరికరాలతో పాటు వ్యవసాయ పనిముట్లు నిల్వ ఉంచి గదిని పెట్రోల్ పోసి నిప్పంటించాన్నారు. ఈ ఘటనలు మరువక ముందే గడివేములలో 27 జామ చెట్లను నరికి వేయడం చాలా బాధాకరమన్నారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా వారికే తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పోటీ చేయకుండా పోలీసులు బెదిరించి అడ్డుకున్నారన్నారు. ఎవరికీ అధికారం శాశ్వతం కాదని రాబోయే కాలంలో తమ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్నారు. తమ పార్టీ అధికారంలోకి ఉన్నప్పుడు దాడులకు పాల్పడి ఉంటే ఎంత మంది ఉండే వారో టీడీపీ నేతలు చెప్పాలన్నారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందజేయకుండా దౌర్జన్యాలు, దాడులకు పాల్పడం సిగ్గుచేటన్నారు. గడివేముల మండలంలో గత 15 ఏళ్ల నుంచి ఎటువంటి ఫ్యాక్షన్ గొడవలు, దౌర్జన్యాలు లేవన్నారు. కాటసాని వెంట వైస్ ఎంపీపీ కాలునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, బాల చిన్ని, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, పోగుల చంద్రశేఖర్ రెడ్డి, గని ప్రతాపరెడ్డి, సీపీ రమణయ్య చంద్రమౌళీశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, పుల్లయ్య, బండపల్లి రమేష్ , నబి రసూల్ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సచివాలయ సిబ్బంది గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ప్రత్యేక ఓటర్ల నమోదు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన దరఖాస్తుల స్వీకరణ, సాధారణ బదిలీలు తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులలో 41 ఫిర్యాదులు రీ ఓపెన్ అయ్యాయని, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన 84 దరఖాస్తుల్లో ఒక దరఖాస్తు రీఓపెన్ అయినప్పటికీ సంబంధిత జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరు సరిగా లేదని, విధుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత హెచ్‌ఓడీలు సచివాలయాలను పర్యవేక్షిస్తూ సచివాలయ సిబ్బందిని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు చేసేలా పనులు కల్పించాలన్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా ఈనెల 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని రెవెన్యూ, బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. పనితీరుపై రోజు వారి నివేదిక ఇవ్వాలని డీఆర్‌ఓ పద్మజకు సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద వంశపారంపర్యంగా 18 కుల వృత్తుల చేతి పని వారులను ప్రోత్సహించి గుర్తింపు కార్డు, శిక్షణ, ఉచిత పనిముట్లు కూడా పంపిణీ చేస్తోందని ఇందుకు సంబంధించి 51,920 దరఖాస్తులు వచ్చాయని ఇందులో 43 వేల దరఖాస్తులు టైలరింగ్ దరఖాస్తులు అర్హత లేనివని, క్షేత్ర స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు స్వయంగా పరిశీలించి వాస్తవ నివేదికలను ఈనెల 23వ తేదీలోగా అందజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ కౌలు రైతుల సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యాన్ని వేగవంతం చేయాలన్నారు జిల్లాలో 27,784 సీసీఆర్‌సీ కార్డులలో ఇంకా 7వేల సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో లక్ష్యాన్ని ఛేదించాలన్నారు.



కలెక్టర్ రాజకుమారికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

సోదర ప్రేమకు ప్రతిరూపం రక్షాబంధన్

నంద్యాల(వ్యవసాయం): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలో సోమవారం సోదరులకు మహిళలు రక్షాబంధన్‌ను కట్టి సోదర భావాన్ని తెలియజేసి 'నీవు నాకు రక్ష.. నేను నీకు రక్షా.. మన ఇద్దరం ధర్మాన్ని దేశాన్ని రక్షిద్దామని ప్రతిజ్ఞ పూనారు. సోదరి ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ పండుగలా నిర్వహించారు. పట్టణంలో పలువురు మహిళలు అన్నలకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి దీవించారు. కలెక్టర్ సమావేశం భవనంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకుల అనసూయ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజకుమారికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి కాలంలో సోదరి సోదర మధ్య సంబంధాలను పటిష్టం చేస్తూ సోదరి ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్‌ను నిర్వహించుకోవడం ఎంతో ఆనంద కరంగా ఉందన్నారు.

గాజులపల్లెలో కుండపోత వర్షం



నంద్యాల(అర్బన్): మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దాదాపు 2 గంటల పాటు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. వారం రోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడిపోతున్న ప్రజలు ఈ వర్షంతో వాతావరణం చల్లబడి ఊరట చెందారు.

నలుగుతున్న నాలుగో సింహం

- పోలీసుల బదిలీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం
- బాధ్యతలు చేపట్టక ముందే స్టేషన్ల మార్పు
- ఎస్ఐలు, సీఐలపై తీవ్ర ఒత్తిడి



జూపాడుబంగ్లా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పది నిమిషాలకే బదిలీ అయిన ఎస్ఐ కేశవ్

జూపాడుబంగ్లా: పోలీసు శాఖలో బదిలీల వేళ అధికారులు రాజకీయ నేతల చేతిలో పావులుగా మారిపోతున్నారు. వారికి నచ్చితే సీఐ, ఎస్ఐలకు గ్రీన్ కార్పెట్ వేసి తమ స్టేషన్లకు పిలిపించుకుంటున్నారు. నచ్చని వారిని స్టేషన్ మెట్లు కూడా ఎక్కించడం లేదు. ఇటీవల నందికొట్కూరు నియోజకవర్గంలో చోటు చేసుకున్న బదిలీలు ఇందుకు నిదర్శనం. సోమవారం జూపాడుబంగ్లా నూతన ఎస్ఐగా కేశవ్ బాధ్యతలు చేపట్టిన కేవలం పది నిమిషాలకే బదిలీ కావటం గమనార్హం. రెండు రోజుల క్రితం జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణను నంద్యాల త్రీటౌన్‌కు బదిలీచేయగా ఆయన స్థానంలో కర్నూలు ఎలెక్షన్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కేశవ్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు కేశవ్ సోమవారం జూపాడుబంగ్లా చేరుకుని బాధ్యతలు చేపట్టారు. పోలీసుస్టేషన్ జనరల్ డైరీలో ఎంటర్ చేసి సంతకం చేసి సిమ్ స్వాధీనం చేసుకునేలోపే జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఫోన్ చేసి వెంటనే జూపాడుబంగ్లా విధుల్లోంచి రిలీవ్ అయ్యి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు రావాలని ఆదేశించారు. దీంతో ఆయన హుటాహుటినా జిల్లా కేంద్రమైన నంద్యాలకు వెళ్లిపోయారు. నంద్యాల త్రీటౌన్‌కు బదిలీ అయిన లక్ష్మీనారాయణ జూపాడుబంగ్లా ఎస్ఐగా యథావిధిగా కొనసాగనున్నట్లు సమాచారం.

- ➤ కర్నూలు వీఆర్లో ఉన్న సి.శరత్‌కుమార్‌రెడ్డిని ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌కు ఎస్ఐగా నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్.కోయప్రవీణ్ ఈనెల 17న ఉత్తర్వులు జారీచేశారు. అయితే తాను ముచ్చుమర్రిలో ఎస్‌గా విధులు నిర్వహించలేనని తనకు మరో పోలీసుస్టేషన్ కేటాయించాలని సి. శరత్‌కుమార్‌రెడ్డి కోరినట్లు సమాచారం.
- ➤ నందికొట్కూరు నియోజకవర్గంలో ఎంపీ శబరి, ఎమ్మెల్యే జయసూర్య వర్గాల మధ్య కోల్డ్‌వార్ నడుస్తుండటంతో పోలీసు అధికారుల బదిలీలు రాజకీయమయ్యాయి. నియోజకవర్గంలోని స్టేషన్లకు సీఐ, ఎస్ఐలుగా ఎవరు వస్తారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో తమ స్థానాలను పదిలం చేసుకోవటం కోసం కొందరు పోలీసు అధికారులు ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో శాంతి భద్రతలపై దృష్టి సారించలేకపోతున్నారు.

- ➤ ఈనెల 2వ తేదీన నందికొట్కూరు రూరల్ సీఐగా సుధార్‌రెడ్డిని నియమిస్తూ పోలీసుబాస్ ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వులు వెలువడిన కేవలం నాలుగు, ఐదు గంటల్లోనే ఆయనను బదిలీచేస్తూ ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న బీఆర్ కృష్ణయ్యను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరింత ఆసక్తికరంగా రెండు వారాల క్రితం బీఆర్ కృష్ణయ్యను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో అనంతపురం జిల్లా ధర్మవరంలో విధులు నిర్వహిస్తున్న టి.సుబ్రమణ్యంను నియమిస్తూ పోలీసుబాస్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నియోజకవర్గంలోని పోలీసు శాఖలో ఏమి జరుగుతుందో అర్థంకాక పోలీసులు తలలు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సీఐ సుబ్రమణ్యం కూడా జాయిన్ అవుతారా లేక ఆయన స్థానంలో మరొకరిని నియమిస్తారా అని వేచి చూశారు. ఎట్టకేలకు సోమవారం నందికొట్కూరు రూరల్ సీఐగా టి.సుబ్రమణ్యం బాధ్యతలు చేపట్టారు.

క్లుప్తంగా

పశు బీమా పథకం పునరుద్ధరణ

కర్నూలు(అగ్రికల్చర్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2024 మే 20న జారీ చేసిన పశు బీమా పథకం (లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్)ను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి యథావిధిగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే పథకం అమలుకు బడ్జెట్‌ను మాత్రం నామమాత్రంగా విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో బీమాకు అర్హత ఉన్న తెల్ల, నల్ల జాతి పశువులు 2,89,299 నంద్యాల జిల్లాలో బీమాకు అర్హత కలిగిన నల్ల, తెల్లజాతీ పశువులు 3,11,737 ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ గుర్తించింది. అయితే కర్నూలు జిల్లాకు రూ.11 లక్షలు, నంద్యాల జిల్లాకు 12 లక్షలు మంజూరు చేసింది. ఈ బడ్జెట్‌తో కర్నూలు జిల్లాలో 500, నంద్యాల జిల్లాలో 600 వరకు పశు సంపదకు మాత్రమే బీమా చేసుకునే అవకాశం ఉంది. అంతంతమాత్రంగా బడ్జెట్ ఇవ్వడం పట్ల పశుసంవర్ధక శాఖ అధికారులే పెదవి విరుస్తున్నారు. బీమా కింద జాతి పశువులకు రూ.30 వేలు, నాటు పశువులకు రూ.15 వేలు, సన్న జీవాలకు రూ.6 వేలు పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది. పూర్తి వివరాలకు పశు వైద్యులు/ఏడీలను సంప్రదించాలని ఆ శాఖ అధికారులు సూచించారు.

వీడిన హత్యకేసు మిస్టరీ

- మృతుడు బ్రోతల్ ఆర్గనైజర్
- నాలుగు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

కర్నూలు: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఆవులంపల్లి గ్రామానికి చెందిన మద్దిలేటి నాగభూషణం (45) హత్య కేసు మిస్టరీ వీడింది. కర్నూలు శివారు ఔటర్ రింగ్ రోడ్డులోని టిడ్కో ఇళ్లకు సమీపంలో కాదంబరి టౌన్‌షిప్ వద్ద గుర్తు తెలియని మృతదేహం పడిఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈ నెల 15వ తేదీన కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఓటరు గుర్తింపు కార్డుతో ఆధారాలు లభ్యం

మృతుడి జేబులో లభించిన తల్లి చౌడమ్మ ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా అతని వివరాలు సేకరించారు. మద్దిలేటి నాగభూషణం బ్రోతల్ ఆర్గనైజర్‌గా పనిచేస్తుండగా గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన పెరవలి సుకన్యతో పరిచయం పెరిగింది. ఏడాది పాటు ఆమెతో సహజీవనం చేశాడు. కొంత కాలం తర్వాత మద్దిలేటి ప్రవర్తన నచ్చక దూరంగా ఉండటంతో ఆమెపై చెడుగా ప్రచారం చేస్తుండటం వల్ల సమీప బంధువు తాడేపల్లికి చెందిన అజయ్, రామారావు, బాజీలతో కలిసి హత్య చేసేందుకు పథకం రచించారు. ఈనెల 14న గుంటూరులోని మహేంద్ర ట్రావెల్స్‌లో ఒక వాహనాన్ని అద్దెకు తీసుకుని సుకన్యతో పాటు అజయ్, రామారావు, బాజీ కలిసి మద్దిలేటి స్వగ్రామానికి వెళ్లారు. గ్రామ శివారులో సుంకులమ్మ దేవాలయం వద్ద టీ తాగుతుండగా మాట్లాడే పని ఉందంటూ అతన్ని వాహనంలో ఎక్కించుకుని కొంత దూరం వచ్చిన తర్వాత హత్య చేశారు. కర్నూలు మీదుగా తాడేపల్లికి వెళ్తూ కాదంబరి టౌన్‌షిప్ వద్ద మృతదేహాన్ని పడేసి వెళ్లారు. పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించి తాడేపల్లిలో డోలాస్ నగర్‌లోని ఇంటి వద్ద ఉన్న పెరవలి సుకన్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. తనపై చెడుగా ప్రచారం చేస్తుండటంతో బంధువు, స్నేహితుల సహాయంతో హత్య చేసినట్లు ఆమె అంగీకరించారు. ఆమెతో పాటు అజయ్, రామారావు, బాజీ (డ్రైవర్)లను అదుపులోకి తీసుకుని కర్నూలుకు తీసుకొచ్చి సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

ఉత్సవ శోభితం.. భక్తి పరిమళం



రాఘవేంద్రుల బృందావన సేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

- ఆకట్టుకున్న శాకోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

మంత్రాలయం: తుంగభద్ర పరవళ్లు.. వేదభూమి ఆధ్యాత్మిక వెలుగుల మధ్య రాఘవేంద్రుడి ఆరాధన వేడుకలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శాకోత్సవం, రజత మంటపోత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఉదయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో రాఘవేంద్రుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, పుష్పార్చన, పంచామృతాభిషేకం విశేష అలంకరణ చేపట్టారు. పీఠాధిపతి మూల బృందావనానికి అర్చనలు చేసి హారతులు పట్టారు. సాయంత్రం శ్రీమఠంలో నూతనంగా నిర్మించిన మధ్వ కారిడార్, ఉత్సవ మంటపం, రాఘవేంద్రుల నామ విద్యుద్దీప ఏర్పాటును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. రాత్రి ఊంజల మంటపంలో రాయరు మూల విరాట్‌కు దివిటీ సేవ, ఊయల సేవ చేపట్టారు. అక్కడే శాఖోత్సవం (కూరగాయలు, ఫలాలు) పూజలు నిర్వహించారు. కుంకుమ, పుష్పార్చనలు, మంగళ హారతులు పట్టి శాఖోత్సవాన్ని గావించారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను అంబారి, చెక్క, స్వర్ణ, నవరత్న రథాలపై వైభవంగా ఊరేగించారు.



మయూర వాహనంపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

యోగీంద్ర మంటపంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాదలహరి సంగీత విద్య బృంద (మైసూరు) తాళ, వాద్య సంగీత ప్రదర్శన వీనుల విందు చేసింది. పుత్తూరు నరసింహ నాయక్ (బెంగళూరు) దాసవాణిలో ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. నృత్యోపాసన కళా అకాడమీ (పుత్తూరు) బృందం భరతనాట్య భంగిమలు మైమరిపించాయి. వేడుకలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతి ఆచార్, పీఆర్వో నరసింహామూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.



శాకోత్సవ పూజలో పీఠాధిపతి

నేడు పూర్వారాధన..

వేడుకల్లో భాగంగా మంగళవారం పూర్వారాధన వేడుకలు జరగనున్నాయి. వేడుకలో భాగంగా ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సింహవాహనంపై ఊరేగిస్తారు. ఉదయం రాఘవేంద్రుల బృందావనానికి విశేష పూజలు ఉంటాయి.

విధుల్లోకి 200 మంది కార్మికుల ప్రతిపాదన రద్దు

కర్నూలు(టౌన్): గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న విధుల్లో 200 మంది కార్మికుల ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్లు నగర మేయర్ బీవై.రామయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలకలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, క్రాంతికుమార్, యూనూస్‌బాషా, జుబేర్, మిద్దె చిట్టెమ్మ పాల్గొన్నారు. 200 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటే ఒక విధానం ఉంటుందని, ఇష్టానుసారం నియమిస్తే ఎలాగని పలువురు స్టాండింగ్ కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రోడ్డున పడ్డ 90 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. 200 మంది కార్మికులను తీసుకోవాలంటే స్టాండింగ్ కమిటీలో తీర్మానం చేసి సర్వసభ్య సమావేశంలో పాలక సభ్యుల ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మంత్రి చెప్పాడని ఏ ప్రాతిపదికన తీసుకుంటారంటూ సభ్యులు ఈ అంశాన్ని వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని సమావేశంలో ఉన్న మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డికి తెలియజేశారు. కార్మికుల నియామకంలో నిబంధలను పాటించాలన్నారు. ఇదిలాఉంటే కీలక నిర్ణయాలు తీసుకునే సమావేశంలో మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్రాజెక్టు నుంచి అధికారులు గైర్హాజరు కావడంపై స్టాండింగ్ కమిటీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే సెలవుల్లో ఉన్నారంటూ ఇతర అధికారులు సర్దిచెప్ప బోగా, తమకు సమాచారం ఉంటే బాగుంటుందని సభ్యులు అన్నారు.



మేయర్ అధ్యక్షతన పాలనాపరమైన అంశాలపై చర్చిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టదా?

డోన్ రూరల్: రాయలసీమలోని రైతాంగాన్ని ఆదుకునేందుకు రిజర్వాయర్లు, చెరువులను నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రాజెక్టుల ద్వారా నీటిని నిరుపయోగంగా సముద్రంలోకి వదలడం దారుణం అని మండిపడ్డారు. రాయలసీమ ప్రాంతంలో తాగు, సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. పంటలు ఎండుతున్నా పాలకులకు కనిపించడం లేదా అని నిలదీశారు. నీటిని వృథాగా సముద్రంలోకి వదిలే బదులు రాయలసీమ ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపితే రైతుల కష్టాలు తీరతాయని సూచించారు. అలాగే శ్రీశైలంలో కరెంట్ ఉత్పత్తిని తగ్గించి సాగునీరు అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల గురించి ఆలోచన చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రైతుల బాధను అర్థం చేసుకొని చెరువులకు నీటిని నింపే కార్యక్రమం చేపట్టాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పెట్టుబడి సాయం ఏదీ?

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా అందించలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దుయ్యబట్టారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, అన్యాయం చేయాలని చూస్తే ఆందోళనలకు దిగుతామని స్పష్టం చేశారు. హామీలు విస్మరిస్తే రైతులు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యులు రామచంద్రయ్య, కె.రామాంజినేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మోటారాముడు, నారాయణ, వరదరాజులు పాల్గొన్నారు.

మందుబాబుకు ఝలక్

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. స్థానిక టూటౌన్ పరిధిలో విశ్వనగర్‌కు చెందిన కందుకూరి సుమంత్ ఆచారి మద్యం సేవించి వాహనం నడుపుతుండటంతో పోలీసులు అడ్డుకుని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. మోతాదుకు మించి మద్యం తాగినట్లు తేలడంతో సెక్షన్ 185 ఎంవీ యాక్ట్ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ నేత దారుణ హత్య

- కుటుంబ కలహాలే కారణమని అనుమానం

ఆదోని రూరల్: కుటుంబ కలహాలతో బీజేపీ నేత దారుణ హత్యకు గురైన ఘటన ఆదోని మండలంలో చోటు చేసుకుంది. తాలూకా సీఐ నల్లప్ప, ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలివీ.. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఉప్పర శేఖన్న(48) ఆదివారం అర్ధరాత్రి తన ఇంటి ముందే దారుణహత్యకు గురయ్యాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య జయమ్మకు పిల్లలు కాకపోవడంతో రెండో భార్యగా గంగమ్మను కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వీరంతా కలిసే జీవిస్తున్నారు. అయితే మూడు నెలల క్రితం బతుకు తెరువు నిమిత్తం బెంగళూరుకు కుటుంబం మొత్తం వలస వెళ్లింది. అక్కడ పనిచేసుకుంటుండగా రెండో భార్య గంగమ్మ ప్రవర్తనపై అనుమానంతో గొడవపడ్డారు. దీంతో అక్కడి నుంచి శేఖన్న, ఆయన పెద్ద భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిసి కొన్ని రోజుల క్రితం స్వస్థలమైన పెద్దహరివాణం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు కుటుంబమంతా భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. కొద్దిసేపటికి శేఖన్న బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 11 గంటల సమయంలో కుమార్తె నీళ్లు కావాలని తల్లి జయమ్మను అడుగగా నిద్రలేచిన ఆమె కుమార్తెకు నీరు తాపించింది. పక్కన భర్త కనిపించకపోవడంతో భార్య తలుపులు తెరిచి బయటకు చూసింది. తన భర్త శేఖన్న ఇంటి ముందున్న అరుగుపై పడుకుని ఉన్నాడని భావించి దుప్పటి కప్పుతుండగా రక్తపు మరకలు చూసి గట్టిగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా గొంతుపై కత్తి పోట్లు ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించగా సోమవారం తెల్లవారుజామున తాలూకా సీఐ నల్లప్ప, ఎస్ఐ నాగేంద్ర గ్రామానికి చేరుకున్నారు. ఉదయం డాగ్ స్క్వాడ్‌ను పిలిపించగా ఇంటి నుంచి కొంత దూరంలో ఉన్న ఓ వంక వైపు వెళ్లి మరలా ఇంట్లోకి చేరుకుంది. దీంతో పోలీసులు అనుమానాస్పదంగా భావించి పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి శేఖన్న మృతదేహాన్ని తరలించారు. అయితే గ్రామస్తుల సమాచారం మేరకు ఇది ముమ్మాటికీ హత్యేనని.. రెండో భార్యతో ఉన్న కుటుంబ కలహాలే ఇందుకు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం గంగావతి పట్టణంలో బతికేందుకు వెళ్లిన శేఖన్న, ఆయన రెండో భార్య గంగమ్మ మధ్య గొడవ జరగడంతో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసిందని, పోలీసులు నచ్చజెప్పి పంపించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే రెండో భార్య సోదరులే తన భర్తను హత్య చేసి ఉంటారని మొదటి భార్య జయమ్మ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రక్తపు మడుగులో ఉప్పర శేఖన్న

అర్జీలను గడువులోపు పరిష్కరించకపోతే చర్యలు

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి మ ధ్యాహ్నం 2 గంటల వరకు పీజీఆర్ఎస్‌లో భాగంగా జేసీ బి.నవ్యతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అధికారి రోజూ సాయంత్రం తప్పనిసరిగా లాగిన్ అయ్యి అర్జీలను గమనించాలన్నారు. నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా దృష్టి సారించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకూడదని, అయితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుల సెల్‌కు సంబంధించిన ఆడిటింగ్ బృందాలు కూడా రీఓపెన్ కేసులను పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లాకు సంబంధించి 94 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 23 పరిష్కారం కాగా, 71 పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఏఎన్ఎం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో నిర్వహిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఫిమేల్)/ఏఎన్ఎం కోర్సుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వై.జయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు మీడియంలో రెండు సంవత్సరాల పాటు కోర్సు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళా అభ్యర్థులు ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణులు.. వొకేషనల్, వన్ సిట్టింగ్ ఉత్తీర్ణత పొందిన వారు కూడా అర్హులన్నారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయని, ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, ఉచిత వైద్యపరీక్షలు, ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 8555910104, 9059327020, 9959030873, 9490843980 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎంపీడీఓల బదిలీలకు కసరత్తు

- సీనియారిటీ జాబితా రూపొందిస్తున్న జెడ్పీ అధికారులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎంపీడీఓల బదిలీలకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయంలో కసరత్తు జరుగుతోంది. ఒకే ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని తప్పక బదిలీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన దృష్ట్యా జెడ్పీ అధికారులు ముందుగా ఎంపీడీఓల సీనియారిటీపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 మండలాలు ఉండగా, 44 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు ఉన్నారు. మిగిలిన తొమ్మిది మండలాలకు ఈఓఆర్డీ/కార్యాలయ పరిపాలనాధికారులు ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా వ్యవహరిస్తున్నారు. 44 మందిలో తొమ్మిది మంది ఒకే ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. వీరికి బదిలీ తప్పదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వీరిలో కొందరు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లేఖల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఐదేళ్ల సర్వీసు పూర్తి కాని వారు కూడా బదిలీల కోసం ప్రయత్నిస్తుండడం గమనార్హం. జెడ్పీ చైర్మన్ గుజరాత్‌కు శిక్షణకు వెళ్లిన నేపథ్యంలో ఆయన వచ్చిన తర్వాత బదిలీలపై దృష్టి సారించే అవకాశం ఉంది.

ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్న ఎంపీడీఓలు

గీతావాణి(ఆదోని), ఏసీ రాముడు(సీ.బెళగల్), శివ నాగప్రసాద్(ఓర్వకల్), వాసుదేవమూర్తి(బండిఆత్మకూరు), ఎం.శ్రీనివాసులు(డోన్), నాగేశ్వరాచలరెడ్డి(మిడుతూరు), దస్తగిరి(పాణ్యం), ఫజుల్ రహమాన్(ప్యాపిలి), అమానుల్లా(వెలుగోడు).

ఇంజనీరింగ్ శాఖల్లో..

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 105 మంది ఏఈలు ఉండగా వీరిలో 43 మంది ఐదేళ్ల సర్వీసు ఒకే ప్రాంతంలో పూర్తి చేసుకున్నారు.
- 31 మంది డీఈఈల్లో ఎనిమిది మందికి ఐదేళ్ల సర్వీసు పూర్తి కావడంతో వీరికి బదిలీలు తప్పవని తెలుస్తోంది.
- గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మొత్తం 49 మంది ఏఈల్లో 12 మంది ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు.
- 10 మంది డీఈఈల్లో ఇద్దరికి మాత్రమే ఐదేళ్ల సర్వీసు పూర్తయ్యింది.
- గ్రామీణాభివృద్ధికి సంబంధించి ఈఓఆర్డీలలో పరిపాలనా సౌలభ్యంలో భాగంగా పలువురికి స్థాన చలనం తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

> **జాబితా రూపొందిస్తున్నాం**
>
> ఎంపీడీఓలు ఎవరెవరు ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్నారనే విషయాలను పరిగణనలోకి తీసుకొని సీనియారిటీ జాబితాను రూపొందిస్తున్నాం. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాల్సిందే.
>
> – జి.నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

కబళించిన మృత్యువు

- బైక్‌పై వెళుతుండగా ఢీకొట్టి వెళ్లిపోయిన గుర్తు తెలియని వాహనం
- తీవ్రంగా గాయపడి రెండు గంటల వ్యవధిలోనే ఇద్దరి మృత్యువాత
- మృతులు బనగానపల్లె మండల వాసులు





మృతి చెందిన ప్రభుదాసు, కిషోర్‌కుమార్

కొలిమిగుండ్ల: బెలుం గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. బనగానపల్లె మండలం చెరువుపల్లె గ్రామానికి చెందిన ప్రభుదాసు (22), కిషోర్‌కుమార్ (16) బెలుం వద్ద నాపరాతి గనిలో జేసీబీ ఆపరేటర్, హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ప్రభుదాస్‌కు ఆళ్లగడ్డ మండలం చింతకుంటకు చెందిన విజయలక్ష్మితో ఆరు నెలల క్రితమే వివాహం జరిగింది. అలాగే వెంకటాపురంకు చెందిన రాజశేఖర్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు కిషోర్‌కుమార్ (16) ఎనిమిదవ తరగతి వరకు చదువుకొని మానేశాడు. ఆ తర్వాత పనులకు పోతుండేవాడు. వీరిద్దరూ బెలుంలోనే ఉంటూ 20 రోజులుగా నాపరాతి గనుల వద్ద జేసీబీ ఆపరేటర్, హెల్పర్‌గా పని చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున పని నిమిత్తం ఇద్దరు బైక్‌లో అవుకు మండలం రామాపురం వెళ్లి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో బెలుం సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే కొలిమిగుండ్ల వైపు నుంచి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు వారిద్దరిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రెండు గంటల వ్యవధిలో ప్రభుదాసు, కిషోర్‌కుమార్ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

పిడుగుపాటుకు 33 జీవాలు మృతి

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామ కొండల్లో పిడుగుపాటుకు గురై 33 జీవాలు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటేశ్వర్లు జీవాల మందను మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతని మందలో 150కి పైగా జీవాలున్నాయి. ఈ క్రమంలో సోమవారం జీవాలను మేపేందుకు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జీవాలు అక్కడున్న చెట్టు కిందకు చేరుకోగా పిడుగు పడడంతో 33 జీవాలు మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన జీవాల విలువ దాదాపు రూ.3.5 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



మృతి చెందిన జీవాలు

గిరిజన ఆశ్రమ పాఠశాలను తరలించొద్దు

- విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల నిరసన

ఆలూరు రూరల్: పట్టణంలోని స్థానిక హత్తిబెళగల్ రోడ్డులో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండల కేంద్రానికి తరలించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు రెండో రోజు నిరసన వ్యక్తం చేశారు. వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో గిరిజనుల పిల్లలు చదువుకునేందుకు ఏర్పాటు చేసిన పాఠశాలను ఇక్కడి తరలిస్తే గిరిజనులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మైనా, ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పాఠశాలను ఇక్కడ నుంచి తరలించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణంలో బాలికల ఆశ్రమ పాఠశాలను ఉండడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారంటూ రవి శంకర్ గౌడ్ అనే వ్యక్తి లోకాయుక్తాకు ఫిర్యాదు చేయడంతో గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాఠశాలను తుగ్గలికి మారుస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. పాఠశాల మార్పును ఖండిస్తూ పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించవద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు రెండో రోజు ఆందోళన చేపట్టారు. ఆలూరు మండలంలోని అరికెర తండా, వివిధ గ్రామాల విద్యార్థులు, హొళగుంద మండలంలోని నెరణికి తండా, కొత్తపేట గ్రామాలతో పాటు మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన 297 మంది గిరిజన బాలికలు ఈ పాఠశాలలో చదువుతున్నారు. 2016 ఏడాది గిరిజన పాఠశాల ప్రారంభించారు. పాఠశాలకు ప్రత్యేక భవనం లేకపోవడంతో స్థానిక బాలుర గిరిజన పాఠశాలలో కొనసాగిస్తున్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు

పాఠశాల మారిస్తే ఇబ్బంది పడతాం



నేను నా భర్త కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాం. మా అమ్మాయి సురికి బాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదవుతోంది. మా గ్రామానికి 10 కిలో మీటర్ల దూరంలో ఆశ్రమ పాఠశాల ఉండడంతో ఎంతో సౌకర్యంగా ఉంది. మా పిల్లలు తుగ్గలికి వెళ్లి చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలను ఇక్కడే కొనసాగించాలి.

– లక్ష్మీ బాయి, నెరణి తండా

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం



ఆలూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఇతర ప్రాంతానికి మారుస్తున్నట్లు ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను ఖండిస్తున్నాం. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించకుండా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు. ఆలూరు ప్రాంత గిరిజన వాసుల కోసం 2016లో ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలను ప్రారంభించారు. ఉత్తర్వులు వెనక్కి తీసుకునే వరకు ఆందోళన చేస్తాం.

– రవి నాయక్, ఎస్ఎంసీ చైర్మన్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ ONLINE SSC, INTER(1yr), DPPTTC, DEGREE, PG, MBA & MCA కొరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, కర్నూలు. సెల్: 7981223882. [L-495]

■ Wanted Male Academic Principals in a Reputed Educational Organisation. Age: 30 to 45years, Qualification Any Degree. Salary Upto: 30,000/- Location: Kurnool. Contact: 9248733342 [G-5612]

■ కస్టమైనా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు,RMP & డాక్టర్స్ కావలెను.జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 7995365999 [HA-98204]

REAL ESTATE

■ కర్నూలు-నంద్యాల రోడ్, రాగమయూరి ప్రక్కన 30x45 సైజులో ఇల్లు కట్టించి ఇవ్వబడును. మరియు ఓర్వకల్లు, తిప్పాయిపల్లె రోడ్‌లో నూతన వెంచర్‌లో తక్కువ ధరకు ప్లాట్లు కలవు. ✆ 9963800314. [L-796534]

■ పార్కింగ్ అటెండర్స్ కావలెను. కర్నూలులోని ప్రముఖ మాల్లో పని చేయుటకు యువతీ, యువకులు. అర్హత: 8th పాస్. సంప్ర : 8686440933 [SCA24000172]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6536]

WANTED

■ ప్రముఖ వస్త్ర దుకాణం నందు పని చేయుటకు అనుభవం గల సేల్స్‌మెన్ కావలెను. జీతం: 6,000-12,000+ఇన్సెంటివ్స్. ఆసక్తి గల వారు సం.ప్ర: 8897888818. [L-796445]

■ J.M. కంప్యూటర్స్ నందు 5 సం॥లు అనుభవం గల కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్ (B.Tech) మరియు మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. సంప్ర: షాప్ నెం.1, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్, Opp: క్రేజీ బాయ్స్, కర్నూలు. సెల్: 98490 41008 [L-796532]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165